క్లుప్తంగా

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ



శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలమహాక్షేత్రమైన శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీన్నులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

కుమారస్వామికి విశేష పూజలు

స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో సోమవారం షష్టి సందర్భంగా ఈఓ ఎస్.లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. స్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



రుణాలు పంపిణీ చేస్తున్న డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్

వెలుగోడు: జేఎల్‌జీ మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ నందిరెడ్డిగారి వెంకటేశ్వరమ్మ అన్నారు. ఇటీవల జేఎల్‌జీ గ్రూపులకు మంజూరైన రూ. కోటి 16 లక్షల రుణాలను సోమవారం స్థానిక కేడీసీసీ బ్యాంకులో రేగడగూడురు సింగిల్ విండో చైర్మ న్ బన్నూరు అంకిరెడ్డితో కలిసి మహిళలకు అందించారు. రుణాల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి జేఎల్‌జీ మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ కష్ణమోహన్, వైఎస్సార్‌సీపీ నా యకుడు నందిరెడ్డిగారి రామిరెడ్డి పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి తప్పక హాజరుకావాలి

పాములపాడు: ఈనెల 9న మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు హాజరుకావాలని చెప్పారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలి

ఆత్మకూరు: బాలింతలు, గర్భిణులకు టీహెచ్ఆర్ అమలుకు కొత్తగా తీసుకువచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను తొలగించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు మంజుల కోరారు. పట్టణంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 3 నుంచి 7 సంవత్సరాలలోపు పిల్లలకు ఎఫ్ఆర్ఎమ్ యాప్ ఆధారంగా బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందించడం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్ వైజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు లక్ష్మీదేవి, సుజాత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆత్మకూరు: పాములపాడు మండలం మద్దూరు, రుద్రవరం గ్రామాల్లోని ఎస్సీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ స్వాములు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ దాస్‌కు వినతిప త్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ గ్రామాల్లో ఎన్నో సంవత్సరాలు కుళాయి కనెక్షన్లులేవని, వీధిదీపాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

వెలుగోడు: వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలపై సోమవారం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖాధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆహారేతర పంటలపై పంట కోత ప్రయోగాలు నిర్వహించేందుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ప్రయోగాల ద్వారా పంట దిగుబడులను అంచనా వేస్తామన్నారు.

పాఠశాలకు కుర్చీల విరాళం

మిడుతూరు: మండల పరిధిలోని కలమందలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన నాగన్న 13 కుర్చీలను (సహచరులు, ఇతరుల సహాయంతో) పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున నాయక్‌కు సోమవారం అందజేశారు. .

మహిళ మెడలో గొలుసు చోరీ

నందికొట్కూరు: పట్టణంలోని సంగయ్య పేటలో రవీంద్రభారతి స్కూల్ వద్ద మహిళ మెడలోని గొలుసు చోరీ జరిగిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. జూపాడుబంగ్లా వైకేపీ కార్యాలయంలో ఏపీఎంగా అంబమ్మ మెడలోని గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు బైకుపై వచ్చి లాక్కెళ్లారని సీఐ విజయభాస్కర్ తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల 'ఉన్నత జీవనానికి' నాంది

- అందుబాటులోకి హయ్యర్ పెన్షన్ స్కీం
- నంద్యాల జిల్లా వ్యాప్తంగా 1,735 మంది ఉద్యోగులకు ప్రయోజనం
- సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటామంటున్న ఆర్టీసీ ఉద్యోగులు



ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు (ఫైల్)

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల, మతాలకు అతీతంగా ఏదో ఒక రూపంలో ప్రజలకు లబ్ధిచేకూర్చుతోంది. అందులో భాగంగానే దేశంలో ఎక్కడాలేని విధంగా ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి ఉద్యోగ విరమణ పొందిన వారి సంక్షేమానికి మరో సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. హయ్యర్ పెన్షన్ స్కీంను ఉద్యోగులకు అందుబాటులోకి తెచ్చింది.

అరకొర పెన్షన్‌కు చరమగీతం

ఇప్పటి వరకూ ఆర్టీసీ (ప్రజా రవాణా శాఖ)లో పని చేసిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం అరకొరగా పెన్షన్ అందేది. రూ. రెండు వేల నుంచి రూ, ఐదు వేల వరకు మాత్రమే పొందేవారు. ఆ విధానానికి చరమగీతం పాడి అధిక పెన్షన్ స్కీం (హయ్యర్ పెన్షన్ స్కీం)ను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా ఇప్పుడందే పెన్షన్ కంటే ఐదు నుంచి 6 రెట్లు వరకూ పెరిగే అవకాశం ఉంది. దీని ద్వారా నంద్యాల జిల్లా వ్యాప్తంగా 1,735 మందికి ప్రయోజనం కలుగుతుంది.

ఆర్టీసీ ఉద్యోగుల జీవితానికి భరోసా

సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ఆర్టీసీ ఉద్యోగుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో ఉద్యోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం కల్పించింది. 2014 సెప్టెంబర్ 1వ తేదీ నాటికి ఆర్టీసీ ఉద్యోగిగా విధుల్లో చేరిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ మెకానిక్‌లు, సెక్యూటి సిబ్బంది, కార్యాలయ సిబ్బంది అర్హులు. ఈ పథకంలో నమోదుకు మొదటి విడత ఏప్రిల్ 3వ తేదీ నుంచి మే 3వ తేదీ వరకు, రెండోవ విడత మే 4వ తేదీ నుంచి జూన్ 26వ తేదీ వరకు అవకాశం కల్పించింది. కొంతమంది ఉద్యోగులు సాంకేతిక లోపం కారణంగా సరైన వివరాలు నమోదు చేయకపోవడం, మరికొంత మంది దరఖాస్తులు తిరస్కరణకు గురవడంతో మరో అవకాశం కల్పించింది. మూడోవ విడతగా జూన్ 27వ తేదీ నుంచి జూలై 11వ తేదీ వరకు ఇచ్చిన గడువు పూర్తయింది. ఉద్యోగులు పూర్తి స్థాయిలో నమోదు చేసుకున్నాక వారి బేసిక్ స్కేల్‌ను అనుసరించి ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్ లెక్కలు కట్టి ఉద్యోగులకు చెల్లించే మొత్తాన్ని ప్రకటించనుంది.

జిల్లా వ్యాప్తంగా ప్రయోజనం పొందనున్న ఆర్టీసీ ఉద్యోగుల వివరాలు..

డ్రైవర్లు	-	650
కండక్టర్లు	-	730
గ్యారేజి మెకానికల్	-	265
సెక్యూరిటీ	-	40
కార్యాలయ సిబ్బంది	-	50
మొత్తం	-	1,735

అద్భుత పథకం



ఆర్టీసీ ఉద్యోగులకు ఇదో అద్భుత పథకం. నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఏడు డిపోల పరిధిలో 1,735 మంది ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ పథకంలో నమోదుకు అవగాహన కల్పించారు. అందరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాం. ఉద్యోగుల దరఖాస్తుల నమోదు కార్యక్రమం పూర్తయింది. ఆర్టీసీ ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ స్కీం అమలు చేయడంతో మా కల సాకారం అయ్యింది.

– శ్రీనివాసులు, జిల్లా ప్రజా రవాణా అధికారి

ఉద్యోగులకు మేలు చేసిన ప్రభుత్వం



ఆర్టీసీ ఉద్యోగులకు సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం ఎంతో మేలు చేసింది. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత అరకొర పింఛన్ వస్తుందని ఆందోళన చెందాం. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగనన్న అధిక పెన్షన్ పథకం తీసుకురావడం సంతోషంగా ఉంది. నమోదు అనంతరం ప్రావిడెంట్ ఫండ్ ఫండ్ సంస్థకు చెల్లించాల్సిన మొత్తం ఒకేసారి కాకుండా వాయిదాల పద్ధతిలో కట్టుకునే అవకాశం కల్పిస్తే వెసులుబాటుగా ఉంటుంది.

– నాగిరెడ్డి, డ్రైవర్, నందికొట్కూరు డిపో

హయ్యర్ పెన్షన్ అద్భుతం



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయ్యర్ పెన్షన్ విధానం తీసుకురావడం అద్భుతం. గతంలో ఇచ్చే పెన్షన్ సరిపోక అనేక ఇబ్బందులు పడేవారు. పదవీ విరమణ పొందిన తర్వాత సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం ఇచ్చే హయ్యర్ పింఛన్ కుటుంబానికి ఎంతో ఆసరా నిలిస్తుంది. మా జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగనన్నకు ఊపిరి ఉన్నంత వరకూ రుణపడి ఉంటాం.

– జ్యోతి కండక్టర్, ఆత్మకూరు డిపో

441 మందికి ఉద్యోగావకాశాలు

నందికొట్కూరు: యువత నైపుణ్యతను ప్రదర్శించిన ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందని బసిరెడ్డి డిగ్రీ కళాశాల చైర్మన్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బసిరెడ్డి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 రకాల కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. 441 మంది యువతను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. టెక్ మహీంద్ర కంపెనీలో 66మంది, సీఈటీసీ, ఎస్ఎస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్-200, విప్రో-25, మహీంద్రా హోమ్ ఫైనాన్స్-50, ఎస్‌బీఐ కార్డ్స్-80, హీటిరో ఫార్మాలో 20 మంది ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, రామచంద్రారెడ్డి, నాగ సత్యనారాయణ, రమేష్ రెడ్డి, శ్రీకాంత్, శ్రీనాథ్, ప్రిన్సిపల్ జాన్ ఏలీషా తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



స్వామి దర్శనార్థం వచ్చిన డీడీ డాక్టర్ రామనాథరావు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథరావు సోమవారం పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ పండితులు స్వామి,అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆయన వెంట ఎంపీహెచ్ఈఓ హుసేన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు: మండలంలోని ఎస్ఎస్‌తండా, బైర్లూటి, సిద్ధాపురం గ్రామాల పరిధిలో ఇటీవల ఆటో, ఆయిల్ ట్యాంకర్ ఢీ కొన్న ఘటనలో మృతి చెందిన, గాయపడిన వారి కుటుంబాలకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ.1.75 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆటో ప్రమాదంలో మృతి చెందిన వరలక్ష్మీబాయి భర్త నాగునాయక్ కుటుంబానికి రూ.50 వేలు, సుబ్బమ్మ భర్త నాగభూషణం కుటుంబానికి కు రూ.50 వేలు, గాయపడిన హనుమాన్ నాయక్, నాగరాజు, వనితలకు ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున నగదును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, సింగల్‌విండో చైర్మన్ సురేష్, జేసీఎస్ కన్వీనర్ లక్ష్మీరెడ్డి, ఎస్ఎస్‌తండా నాయకులు శివశంకర్ నాయక్, వెంకటేశ్వరనాయక్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు తప్పనిసరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు, ప్రజాప్రతినిధులు

వెలుగోడు: పిల్లలకు టీకాలను తప్పనిసరిగా వేయించాలని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. మూడు దశల్లో నిర్వహించనున్న మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ ఇంద్రధనస్సు 5.0 బ్యానర్లను సోమవారం ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ .. టీకాలు తీసుకోని 0–5 ఏళ్ల పిల్లలను గుర్తించి వారికి వ్యాక్సిన్ వేయడమే ఈ మిషన్ లక్ష్యమన్నారు. గ్రామాల్లో ఆశావర్కర్లు నిర్వహించిన సర్వేలో గుర్తించి పిల్లలు, గర్భిణులకు టీకాలు వేయాలన్నారు. మొదటి విడత ఈనెల 7 నుంచి 12, రెండో విడత సెప్టెంబర్ 11 నుంచి 16, మూడో విడత అక్టోబర్ 9 నుంచి 14వ తేదీ వరకు వ్యాక్సినేషన్ కార్యాక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ జయపాల్, మెడికల్ ఆఫీసర్ ప్రసన్న లక్ష్మి, ఎఫ్‌డీపీసీ జగదీష్ చంద్రారెడ్డి, వైద్యులు మల్లికార్జునరెడ్డి, సీహెచ్‌వో నాగేశ్వరరావు, సుదర్శన్‌రెడ్డి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి



స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ నాగభూషణం

కొత్తపల్లి: గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఆత్మకూరు సీఐ నాగభూషణం సూచించారు. సోమవారం కొత్తపల్లి పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అదేవిధంగా రికార్డుల పరిశీలిన, కేసుల వివరాలు, క్రైమ్‌రేటును అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలపాలు, నాటుసారా అమ్మకాలు, అల్లర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హుస్సేన్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

కేసు నమోదు

మిడుతూరు: మండలంలోని సుంకేసు గ్రామంలో ఇంటి మెట్ల నిర్మాణం విషయంలో ఘర్షణ చోటుచేసుకోవడంతో బాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన బొట్ల మహేశ్వరి, బొట్ల బాలమద్దిలేటిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మారుతిశంకర్ తెలిపారు. అలాగే బొట్ల మహేశ్వరి ఫిర్యాదు మేరకు బాలమ్మ, మండ్ల బాలమద్దిలేటిలపై కేసు నమోదైందన్నారు.

పొలం దున్నేశారని ఫిర్యాదు

మండలపరిధిలోని జలకనూరు గ్రామ సర్వేనంబర్ 650/1 పొలంలో 4. 35 సెంట్ల పొలంలోకి ఈనెల 3వ తేదీన అక్రమంగా ప్రవేశించి సాగుచేసిన మొక్కజొన్న, కొర్రపంటను దున్నేశారని నందికొట్కూరు పట్టణానికి చెందిన రమాదేవి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు చింతలపల్లి గ్రామానికి చెందిన వేల్పుల విజయ్ కుమార్, రామకృష్ణారెడ్డి, అతని కుమారులపై కేసు నమోదు చేశామన్నారు.

వేధింపులపై కేసు నమోదు

భర్త అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని మండల పరిధిలోని దేవనూరు గ్రామానికి చెందిన సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కల్లూరు మండలం చిన్న కొట్టాల గ్రామానికి చెందిన రామమద్దిలేటిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి



నందికొట్కూరులో గద్దర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నందికొట్కూరు: ప్రజా సాంస్కృతిక ఉద్యమంలో ప్రపంచం గర్వించదగ్గ విప్లవ కళాకారుడు గద్దర్ అని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో గద్దర్ చిత్ర పటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళుల్పరించారు. రెండు నిమిషాలు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గోపాల్, వెంకటేశ్వర్లు, పుల్లన్న, ఎల్లా నాయుడు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ప్రజా నాయకుడు గద్దర్ మృతి తీరని లోటని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, శేఖర్ అన్నారు . పట్టణంలోని సుదర్శన వర్మభవనంలో సోమవారం గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి డివిజన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, భాస్కర్, ప్రసాద్, రమణ, అలీ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో

ఆత్మకూరు పట్టణంలోని జాతీయ బీసీ సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళులర్పించారు. జాతీయ బీసీ సంఘం రాష్ట్రర కార్యదర్శి రఘురాముడు యాదవ్, నియోజకవర్గ అధ్యక్షులు వెంకటస్వామి గౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలస్వామి యాదవ్ గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాలూకా బీసీ సంఘం అధ్యక్షుడు వీరన్న, పెద్దన్న, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రజాగాయకుడు గద్దర్ మరణం పట్ల సోమవారం శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం, అధ్యాపకులు సూర్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- అబ్దుల్లాపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దూసుకుపోతున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని అబ్దుల్లాపురం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన బ్రోచర్లను ఇంటింటా అందించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం విషయంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ప్రజల ముంగిటకు పాలనను తీసుకువచ్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలిచిందని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం నవరత్నాల పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సత్కారం

ఇటీవల ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన శిల్పా చక్రపాణిరెడ్డిని వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు గజమాలతో సత్కరించారు. గ్రామానికి వచ్చిన అభిమాన నేతకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, మాజీ సింగిల్ చైర్మన్ వంగాల వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

జూపాడుబంగ్లా: సీజనల్‌గా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ పల్లె నిర్మలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివానందరెడ్డి సూచించారు. సోమవారం పోతులపాడు గ్రామంలో సర్పంచ్ పల్లె నిర్మలమ్మ అధ్వర్యంలో ఇండియా క్యాంపస్ క్రూసెడ్ సంస్థ వారు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వెఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'గడప గడపకు' కార్యక్రమం వాయిదా

పగిడ్యాల: స్థానిక గ్రామ సచివాలయం 1,2 పరిధి లో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వ కార్య క్రమం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఈనెల 19వ తేదీ వరకు కోడ్ అమలులో ఉన్నందున కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశామన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామి,అమ్మవారి ఉత్సమూర్తులను విశేషంగా అలంకరించారు. పల్లకీలో కొలువు చేసి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం జరిపారు.

ఘనంగా మౌలాలిస్వామి జార్తలు

మహానంది: గాజులపల్లె మెట్టవద్ద కొలువైన మౌలాలిస్వామి జార్తలు సోమవారం వైభవంగా జరిగాయి. మొహర్రం అనంతరం 9 రోజులకు మౌలాలి స్వామి జార్తలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. భక్తులు ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

మిడుతూరు: భారతీయ సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని ఉత్తరప్రదేశ్ జీయర్ స్వామి అన్నారు. సోమవారం స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయం, శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవార్లను సందర్శించుకున్నారు.

ఓంకారేశ్వరుడికి విశేషాభిషేకం

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఓంకారంలో వెలిసిన శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి శ్రావణమాసం, సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రపాణిశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి పూజలు వైభవంగా జరిగాయి.

ఐటీడీఏకు నూతన అధికారులు



ఏపీఓగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌కుమార్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏకు ప్రభుత్వం నూతన అధికారులను నియమించింది. ఏపీఓగా ఎ.సురేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఏపీఓగా పనిచేస్తున్న పి.మురళీధర్‌ను పార్వతీపురంకు బదిలీ చేశారు.

వార్డు సభ్యుల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

పాములపాడు: మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుడి స్థానానికి ఎన్నికకు నోటిపికేషన్ జారీ అయినట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ సోమవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రమైన పాములపాడులోని 4వ వార్డు సభ్యురాలు వెంకటలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందినందున ఎన్నిక అనివార్యమైందన్నారు. అన్‌రిజర్వ్డు మహిళకు కేటాయించిన ఈ స్థానానికి ఓటరు జాబితాలోని ఆసక్తి గల అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయవచ్చన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద నామినేషన్లు స్వీకరించబడునని తెలిపారు.ఈ నెల 8 నుంచి 10వతేదీ లోపు నామినేషన్లు స్వీకరిస్తామని, 11న స్క్రూట్నీ, 12న తిరస్కరించిన నామినేషన్లపై ఆర్డీఓకు అప్పీల్.. పరిష్కారం, 13న నామినేషన్ల ఉపసంహరణ, 14న తుది జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. 19న పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహించబడునని వివరించారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

పగిడ్యాల: స్థానిక గ్రామ పంచాయతీలోని 9వ వార్డు సభ్యుని ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడినందున మంగళవారం నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం తెలిపారు.

కొత్తపల్లి: మండలంలోని ఖాళీగా ఉన్న వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినట్లు ఎంపీడీఓ మేరి సోమవారం తెలిపారు. కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో 10వ వార్డుకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మిడుతూరు: మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో ఖాళీగా ఉన్న గ్రామ వార్డు ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడినట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి సోమవారం తెలిపారు. మిడుతూరులోని 13వ వార్డు (అన్‌రిజర్వ్డ్ మహిళ), అలగనూరు 10వ వార్డు (ఎస్‌సీ – జనరల్) జలకనూరు 8వ వార్డు (ఎస్‌సీ – మహిళ), పైపాలెం 5వ వార్డు (బీసీ–జనరల్), వీపనగండ్ల 3వ వార్డు (బీసీ – జనరల్)లకు సంబంధించి వార్డు మెంబర్ల ఎన్నికకు ఉప ఎన్నిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

9 నుంచి 'నాభూమి- నాదేశం'



మాట్లాడుతున్న ఏపీడీ అన్వరాబేగం

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వం గ్రామాలలో నిర్వహిస్తున్న నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది విజయవంతం చేయాలని ఏపీడీ అన్వరాబేగం సూచించారు. సోమవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో ఏపీఓ రేష్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది కార్యక్రమంలో భాగంగా 75 మొక్కలు నాటాలని సూచించారు. అదేవిధంగా పోలీసు, ఆర్మీజవాన్లలో అమరవీరులను గుర్తించి వారి పేర్లను శిలాఫలాకాలపై వేయించి సచివాలయాల వద్దగాని, పాఠశాలలో గాని, బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం నందికుంట గ్రామ సమీపంలో హార్టికల్చర్ సాగును పరిశీలించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

మహానంది: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని మహానంది ఎస్ఐ జి.నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. మహానంది, సమీప గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించి, ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.

మెనూ ప్రకారం భోజనాలు అందించాలి

మహానంది: మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాలు అందించాలని బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి సూచించారు. బండిఆత్మకూరులోని బీసీ బాయ్స్ హాస్టల్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఓ స్వాతి, ఉప సర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బకాయిదారులకు నోటీసులివ్వండి

మహానంది: మహానంది దేవస్థానం పరిధిలో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకుంటూ సుమారు రూ.3కోట్లు బకాయిలు ఉన్న వారికి వెంటనే నోటీసులు ఇచ్చి వసూళ్లు చేయాలని ట్రస్టుబోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశించారు. చైర్మన్ కార్యాలయంలో సోమవారం 16వ ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ధర్మకర్తలు పలు అంశాలపై తీర్మానాలు చేశారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని అమ్మవారిశాలలో ఈ నెల 14న లోకకల్యాణం కోసం మహానందీశ్వరస్వామి కళ్యాణోత్సవం నిర్వహించేందుకు తీర్మానించారు. భక్తులు సమర్పించే కానుకల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాల్సిందిగా సభ్యులు సూచించారు. సమావేశంలో ఎక్స్‌అఫీషియో సభ్యుడు, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, సభ్యులు గంగిశెట్టి మల్లికార్జున, వీరభద్రుడు, హేమలత, లక్ష్మీదేవి, పార్వతమ్మ, రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.